క్లుప్తంగా

విరాళం అందజేత



కొత్తకోట: మండల పరిధిలోని కానాయపల్లి గ్రామ సమీపంలోని శ్రీదత్త కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించ నున్న కోటిలింగాల కోసం వనపర్తి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న టి.రాములు, అనురాధ దంపతులు తమ వంతు సాయంగా రూ.27,116 అందజేశారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి



పాన్‌గల్: విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి సామర్థ్యాలను పెంచేలా బోధన సాగించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండలంలోని చింతకుంట ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్లు, విద్యార్థుల స్థామర్థ్యాలను ఆయన పరిశీలించారు. దీంతో పాటు పాఠశాల ఆవరణలో విరివిగా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకం ఆవశ్యకతపై విద్యార్థులు వివరించిన అంశాలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ.. వారిని అభినందించారు. పాఠశాలలో 'మన ఊరు–మన బడి' పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. హెచ్‌ఎం నారాయణ, సీఆర్పీ గోవింద్, సంతోష్ పాల్గొన్నారు.

గ్రామీణ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలి

మీపనగండ్ల: మండల పరిధిలోని తూంకుంటలో గ్రామీణ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, గ్రామపెద్దలు మౌలాలీ, స్వామి, వెంకట్‌రెడ్డి, జావేద్, లక్ష్మీ కోరారు. గతంలో గ్రామంలో 25 సంవత్సరాల నుంచి బుక్ డిపాజిట్ సెంటర్ కొనసాగేదని, ఆ సెంటర్‌ను కూడా తొలగించడంతో గ్రామంలోని యువకులు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గ్రామంలో గ్రామీణ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని గ్రామపంచాయతీ ఏకగ్రీవంగా తీర్మానం చేసి అధికారులకు పంపించామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో గ్రామీణ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

సాగునీరు విడుదల చేయాలని వినతి



పాన్‌గల్: మండలంలోని మాదవరావుపల్లి, శాగాపూర్ గ్రామాల మీదుగా ఉన్న ఎంజే 6–డీ 8 కాల్వకు సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలని కోరుతూ.. ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్యయాదవ్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల రైతులతో కలిసి సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సుబ్బయ్యయాదవ్ మాట్లాడారు. కాల్వ ద్వారా సాగునీరు అందుతుందనే ఉద్దేశంతో ఆయా గ్రామాల్లో చాలా మంది రైతులు పంటలను సాగు చేశారని, ప్రస్తుతం సాగునీరు రాకపోవడంతో సాగు చేసిన 500 ఎకరాల పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. కాల్వకు సాగునీరు విడుదల చేయించి పంటలను కాపాడాలని కోరారు. మండల కోఆప్షన్ సభ్యులు హాలీమ్‌పాషా, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వంట చేస్తుండగా అగ్ని ప్రమాదం

గోపాల్‌పేట: వంట చేస్తుండగా మంటలు అంటుకుని మహిళ గాయాలపాలైన ఘటన రేవల్లి మండలంలోని గౌరిదేవిపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. రేవల్లి ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గౌరిదేవిపల్లికి చెందిన గడ్డిగోపుల లింగమ్మ ఇంట్లో గ్యాస్ సిలిండర్ అయిపోయింది. దీంతో ఉదయం కట్టెలపొయ్యిపై వంట చేసుకుంటుండగా.. ప్రమాదవశాత్తు చీర కొంగు ఆ తర్వాత మొత్తం అంటుకుంది. దీంతో అరుపులు, కేకలు వేసింది. వెంటనే పక్కింటి వారు చూసి మంటలు అదుపు చేసి వెంటనే నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. కుమారుడు రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

కేసు నమోదు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని బాలాజీ దాబా వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ జగదీష్‌రెడ్డి తెలియజేశారు. మండల పరిధిలో రాంపూర్‌కి చెందిన మహబుబ్ కృష్ణానది తీరం నుంచి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా.. గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశామన్నారు.

కౌన్సిలర్లతో మంత్రి భేటీ?

- ఆదివారం రాత్రి పొద్దుపోయే వరకు జిల్లా పార్టీ కార్యాలయంలో రహస్య సమావేశం
- ఒక్కొక్కరిని గదిలోకి పిలిచి మాట్లాడినట్లు సమాచారం
- నిట్టూర్పులో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు
- జిల్లా, పట్టణ పార్టీ అధ్యక్షుల తీరుపై అసహనం



వనపర్తి: కొంత కాలంగా అధికార పార్టీ కౌన్సిలర్లలో అధికులు అసంతృప్తిలో ఉండటం, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం, పంతం నెగ్గకుంటే పార్టీ మారేందుకు సైతం వెనుకాడేదిలేదనే వాదనలు చేస్తుండటంపై స్థానిక మంత్రి దృష్టి సారించారు. ఫిబ్రవరి 2న మంత్రి సతీమణి కౌన్సిలర్లతో సమావేశమై బుజ్జగించినా.. కౌన్సిలర్ల తీరు ససేమిరా అన్నట్లుగా ఉండటంతో మంత్రి నేరుగా.. రంగంలోకి దిగారు. ఆదివారం సాయంత్రం ఏడు గంటలకు బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో అధికార పార్టీ కౌన్సిలర్లు అందరిని రప్పించుకుని అసంతృప్తికి గల కారణాలు, వార్డులో ఎదురయ్యే సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి పనుల వివరాలు ఏమిటని తెలుసుకునేందుకు ప్రత్యేక భేటీ నిర్వహించారు. అర్ధరాత్రి పొద్దుపోయే వరకు కౌన్సిలర్లు పార్టీ కార్యాలయంలోనే ఉండాల్సి వచ్చింది. సమావేశం నిర్వహించినంత సేపు ఫోన్లు స్విచ్ఛాఫ్, సైలెంట్ మోడ్‌లో ఉంచడంతో పాటు ఇతరులెవ్వరినీ లోపలికి రానివ్వకుండా.. తలుపులు మూసుకుని మాట్లాడినట్లు ప్రచారం సాగుతోంది.

గదిలోకి పిలిచి..

అధికార పార్టీలో 25 మంది కౌన్సిలర్లు ఉండగా.. మంత్రి నిర్వహించిన సీక్రెట్ మీటింగ్‌కు 24 మంది హాజరైనట్లు తెలిసింది. ఇందులో ఎనిమిది నుంచి పది మంది మాటకు పార్టీలో, మంత్రి వద్ద విలువలేదనే అసంతృప్తిలో ఉన్నవారు ఉండగా.. వారితో పాటు మిగతా వారిని సైతం గదిలోకి ఒక్కరిని పిలిపించి రహస్యంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. మీకు ఎవరితో వివాదం ఉంది. తన నుంచి ఆశిస్తుంది ఏమిటని ప్రశ్నించి వివరాలను అడిగి తెలుసుకున్నట్లు ప్రచారంలో ఉంది. సమూహంలో మాట్లాడిన విషయాలు బయటకు పొక్కటంతో పాటు కొన్ని విషయాలు చెప్పలేకపోవచ్చని మంత్రి ఒక్కొక్కరితో భేటీ అయినట్లు తెలుస్తోంది.

అసహనం..

కౌన్సిలర్లతో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు సైతం ఈ భేటీలో ఉన్నట్లు తెలిసింది. కౌన్సిలర్లను కంట్రోల్ చేయటంతో రెండు విధాల విఫలమయ్యారని, వారిపై మంత్రి అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇకపై నెలకు రెండుసార్లు వనపర్తి మున్సిపల్ కౌన్సిలర్లతో స్వయంగా నేనే కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించే ప్రయత్నం చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిసింది.

ఇకపై నెలకు రెండుమార్లు..

నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు అందరితో.. నెలకు రెండు మార్లు మిలాకత్ ఏర్పాటు చేసి స్వయంగా తానే కలిసి సమస్యలు తెలుసుకుంటాను. ప్రాంతాల వారీగా నాయకులపై వదిలేస్తే.. వారు సక్రమంగా కేడర్‌ను పట్టించుకోవటం లేదనే భావనలో మంత్రి ఉన్నట్లు తెలుస్తోంది.

మంత్రి మాట్లాడినా.. నిట్టూర్పులోనే..

ఫిబ్రవరి 2న నిర్వహించిన బుజ్జగింపుల సమావేశంలో కౌన్సిలర్లకు ఒక్కొక్కరికి రూ.30 లక్షల పనులు ఇస్తామని చెప్పారు. ఇప్పటి వరకు ఆ ఊసే ఎవ్వరూ మాట్లాడటం లేదు. వార్డుల వారీగా ఎవ్వరికి ప్రొసిడింగ్‌లు అందలేదు. మరో ఏడాదిలో పదవీకాలం ముగుస్తుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే ప్రజల ముందుకు ఓటు కోసం వెళ్లటం కష్టం. మంత్రి భేటీ అవుతున్నారంటే దీర్ఘకాలికంగా చేయలేకపోయిన పనులు చేసుకునేందుకు అవకాశం లభిస్తుందని భావించిన కౌన్సిలర్లు, మీ వార్డులో చేపట్టే అభివృద్ధి పనులపై మీకే సర్వాధికారులు ఇస్తామని చెప్పి, మునుపటి సమావేశంలో ఇచ్చిన మాట విషయంపై మాట్లాడకపోవటంతో పలువురు కౌన్సిలర్లు నిట్టూర్పులోనే ఉన్నట్లు తెలుస్తోంది. మీడియాపై అసహనం వ్యక్తం చేయటంతో పాటు అధికార పార్టీ కౌన్సిలర్లుగా మీరు ఖండించాలని మంత్రి సూచనలు చేసినట్లు తెలిసింది.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుదాం..



అమరచింతలో ఎస్‌బీఎం శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ డాక్టర్ చుక్క మాలతి

అమరచింత: మారుతున్న పరిస్థితులను అధ్యయనం చేసుకుంటూ ప్రతిఒక్కరూ తమ జీవన శైలిలో మార్పు సాధిస్తున్నారని, అలాగే ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా మార్చుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఎంపీపీ డాక్టర్ చుక్క మాలతి కోరారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సంఘాల లీడర్లు, బుక్ కీపర్లకు స్వచ్ఛ పక్వాడ్‌పై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మూడు రోజుల పాటు ఇచ్చే శిక్షణ కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. ప్రతి గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తిస్థాయిలో నిర్మించామన్నారు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో స్థల ప్రభావంతో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం ముందుకు సాగడం లేదన్నారు. గ్రామాల్లోని తడి, పొడి చెత్తను ప్రజలే వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించే స్థాయికి అలవాటు పడ్డారన్నారు. ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో గ్రామాల్లో నిర్మించిన డంపింగ్ యార్డులు ప్రస్తుతం పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చాయన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో గ్రామాలను మరింతగా పారిశుద్ధ్య గ్రామాలుగా తీర్చిదిద్దుకునేందుకు తీసుకోవాల్సిన కార్యక్రమాలను తెలుసుకుని వాటిని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్లు మాట్లాడారు. స్వచ్ఛతపై గ్రామాల్లో తీసుకోవాల్సిన కార్యక్రమాల గురించి వీడియో క్లిప్పింగ్ ద్వారా చూపించి అవగాహన కల్పించారు. గ్రామల్లో సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామంగా మార్చుకునేందుకు రహదారులన్ని ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. పచ్చని చెట్లతో గ్రామంలో పచ్చదనం తీసుకొని రావాలన్నారు. ప్రతిఒక్కరూ బహిర్భూమికి వెళ్లకుండా మరుగుదొడ్డిని వినియోగించుకునే అలవాటును తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మార్క సరోజ, వైస్‌ఎంపీపీ బాల్‌రెడ్డి, ఎంపీడీఓ జ్యోతి, ఆర్‌పిలు రమేష్, కుర్మయ్య, పరీద్, రాజు, సత్యన్న, రఘుతో పాటు ఎంపీఓ నరసింహులు, ఏపీఓ బాలయ్య పాల్గొన్నారు.

మనిగిళ్ల జెడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించిన కేంద్ర బృందం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐఆర్ శంకరన్ కేంద్ర బృందం సభ్యులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం మనిగిళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'అక్షర దీక్ష' కార్యక్రమాన్ని పరిశీలించడానికి ఐఆర్ శంకరన్ కేంద్ర బృందం సభ్యులు సోమవారం వచ్చినట్టు పాఠశాల హెచ్‌ఎం శంకర్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం సభ్యులు విద్యార్థులతో మాట్లాడారు. అక్షర దీక్ష కార్యక్రమం ద్వారా ఉపయోగపడే అంశాలను గురించి విద్యార్థులు కేంద్ర బృందానికి తెలియజేశారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి చాలా అవసరమని, శంకరన్ స్ఫూర్తి కేంద్రం సభ్యులు ప్రముఖ న్యాయవాది శశిభూషణ్ అన్నారు. తల్లి ప్రాధాన్యతను, మాతృమూర్తులను గౌరవించాల్సిన అవసరం ఉందని శంకరన్ స్ఫూర్తి బృందం సభ్యులు రాజు అన్నారు. ప్రతి రోజు ఒక మంచి పనిని చేయాలని, సమాజంపై, దేశంపై గౌరవం విద్యార్థి దశ నుంచే కలిగి ఉండాలన్నారు. ఉపాధ్యాయ బృందం వెంకటేశ్వర్లు, విష్ణువర్ధన్, నాగేశ్వరమ్మ, చంద్రకళ, సురేఖ, శ్రీరాములు, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కుక్కల దాడిలో జాగ్రత్తలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కరుణశ్రీ

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని వీధికుక్కలు, పందులు, కోతులతో, వాటి కాటు బారిన పడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌లో కుక్కల దాడిలో చిన్నారి మృతి దుర్ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలల విద్యార్థులకు జాగ్రత్తలు, ప్రథమ చికిత్సలపై అవగాహన కల్పించారు. కౌన్సిలర్ సుమతి, మున్సిపల్ మేనేజర్ గణేష్‌బాబు, శానిటర్ ఇన్‌స్పెక్టర్ ఉమ మహేశ్వర్‌రెడ్డి, జయరాములు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై సోషల్ ఆడిట్

గోపాల్‌పేట: రేవల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై డీఆర్‌డీఓ నర్సింహులు ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిసెంబర్ 2020 ఒకటో తేదీ నుంచి 2022 డిసెంబర్ వరకు సోషల్ ఆడిట్ నిర్వహించి ఖర్చులపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీఓ భవాని, ఏపీఓ నర్సింహులు, టీఏలు, పాల్గొన్నారు.

ప్రీతి ఆత్మహత్యకు కారణమైన వారిని శిక్షించాలి



వనపర్తి ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న హిందూవాహిని నాయకులు

వనపర్తి క్రైం: వరంగల్ కేఎంసీ పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నం చేసుకోవడానికి కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ.. సోమవారం హిందూవాహిని నాయకులు వనపర్తి మెడికల్ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. గిరిజన, విద్యార్థి సంఘాల నాయకులు జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించి, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా హిందూవాహిని పాలమూరు విభాగ్ కన్వీనర్ అభిలాష్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల కాలంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, రక్షణ కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. హిందూవాహిని నాయకులు రోహిత్, నంద, చరణ్, మూర్తి, అర్జున్, కార్తీక్, వినయ్, మూర్తి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



జడ్చర్లలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పథకాలు సాధించిన విద్యార్థులతో సీనియర్ కరాటే మాస్టర్లు

కొత్తకోట: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణ కేంద్రంలోని సత్యనారాయణ పంక్షన్ హాల్‌లో ఈ నెల 26న నిర్వహించిన 4వ జాతీయ ఇన్విటేషన్ కరాటే చాంపియన్‌షిప్ 2023 కరాటే పోటీల్లో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన కరాటే పోటీల్లో కొత్తకోటలోని గాడ్స్ ఆన్ వారియర్స్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బంగారు, వెండి పథకాలు సాధించినట్టు క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి 1500 మంది విద్యార్థులు పాల్గొనగా.. తమ అకాడమికి చెందిన 19 మంది విద్యార్థులు కటాస్, స్పైరింగ్ విభాగాల్లో ప్రతిభ కనబర్చి బంగారు, వెండి పథకాలు సాధించడంతో పాటు సర్టిఫికెట్లను పొందారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అభినందించి పథకాలు అందజేశారు. సీనియర్ కరాటే మాస్టర్లు జాఫర్ సాధిక్, హరీస్‌యాదవ్, ఇంతియాజ్, జాంగీర్, మంజునాథ్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన...

పట్టణ కేంద్రంలోని నివేదిత పాఠశాలకు చెందిన విద్యార్థులు కె.రష్మిక, యస్.అన్వేషలు ఈ నెల 26న జడ్చర్ల పట్టణంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చి బంగారు పథకాలు సాధించారు. సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్ చంద్ర, వైస్ ప్రిన్సిపాల్ వీణ, ఏఓ బాలకృష్ణ, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

రికార్డుల నమోదులో మెళకువలు పాటించాలి

మీపనగండ్ల: రికార్డులను నమోదు చేయడంలో అంగన్‌వాడీ టీచర్లు మెళకువలు పాటించాలని సీడీపీఓ లక్ష్మమ్మ, సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణమ్మ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మండల స్థాయి సెక్టార్ సమావేశాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పసిపిల్లలకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పౌష్టికాహారాన్ని అందిస్తూ.. పూర్వ ప్రాథమిక విద్యలో చిన్నారులు రాణించేలా చూడాలని ఆమె అంగన్‌వాడీ టీచర్లను కోరారు. గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ.. ప్రభుత్వం నుంచి అందుతున్న పౌష్టికాహారం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న వసతులపై అవగాహన కల్పించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల సమీపంలోకి ఊర కుక్కలు రాకుండా చూసుకోవాలని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు సుగుణాభాయి, కృష్ణమ్మ, మాధవి, చంద్రకళ, పారిజాత తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న పుట్ట అంజనేయుల

ఖిల్లాఘనపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. మార్చి 1 నుంచి 3వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్, జిల్లా గౌరవ అధ్యక్షుడు పుట్ట అంజనేయులు, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు కవిత అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మండల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. నూతన జాతీయ విద్యావిధానం చట్టాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ప్రభుత్వాలు చేసిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలన్నారు. యూనియన్ సెక్టార్ లీడర్లు అరుణ, కవిత, సరోజ, సునీత, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

స్వామివారికి దాసంగాలు



ఆత్మకూర్: పట్టణంలోని చెరువులో వెలిసిన శ్రీస్వయంభూ పరమేశ్వరస్వామి జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం పూజారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి ఉత్సవమూర్తి విగ్రహాలను ఆలయంలోని శివలింగంపై అలంకరించారు. భక్తులు భక్షాలు, పచ్చిపులుసు, అన్నం, స్వామివారికి నైవేద్యంగా సమర్పించి దాసంగాలు పెట్టారు.

నట్టల నివారణ మందుతో జీవాలకు ఆరోగ్యం



ఆత్మకూర్: మేకలకు, గొర్లకు నట్టల నివారణ మందు వేస్తే ఆరోగ్యం చేకూరుతుందని పశుసంవర్ధకశాఖ ఏడీ శ్రీనివాసులు, డాక్టర్ రమేష్ అన్నారు. ఆత్మకూర్ మండల పరిధిలోని పిన్నంచర్లలో సోమవారం పశువర్ధక శాఖ ఆధ్వర్యంలో జీవాలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ నెల 28వ తేదీ వరకు గ్రామాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందని గొర్లు, మేకల కాపరులు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నిర్మల, ఇంద్రజ, సిరాజుద్దీన్, మహిమూద్ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘన నివాళి



ఆజాద్ చిత్రపటానికి నివాళిర్పిస్తున్న నాయకులు

వనపర్తిటౌన్: చంద్రశేఖర్ ఆజాద్ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయమని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో చంద్రశేఖర్ ఆజాద్ 92వ, వర్ధంతిని టీజేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించుకున్నారు. ఈ మేరకు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవి గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహ శర్మ, డప్పు నాగరాజు, ప్రజా సంఘాల ప్రతినిధులు దేవన్న నాయుడు, కొనేటి వెంకటేశ్వర్లు, పుట్ట ఆంజనేయులు, రాజేష్, వెంకటయ్య, చిన్నరాములు, పరమేశ్వరచారి, సత్యం చారి తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా స్వయం పాలన

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. కలెక్టర్‌గా భావన, డీఈఓగా శ్రీదేవి, హెచ్‌ఎంగా తరుణ్ మరో 25 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు.

'ఆరు నెలల్లో బీజేపీదే అధికారం'



మదనాపురంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి

మదనాపురం: తెలంగాణలో వచ్చే ఆరు నెలల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకులు సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ అరాచక పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. నిధులు, నియామకాలు, నీళ్ల పేరుతో వచ్చిన తెలంగాణలో కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందన్నారు. ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్ రూం దళితులకు 3 ఎకరాల భూమి, నిరుద్యోగ భృతి ఏమైందని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కృష్ణ యాదవ్, రవీందర్ రెడ్డి, మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌ఎస్ నుంచి బీజేపీలోకి చేరిక

వనపర్తి క్రైం: గోపాల్‌పేట మండల కేంద్రం నాయకులు రాకాసి అరవింద్, నారాయణతో పాటు మరో 50 మంది టీఆర్‌ఎస్ నాయకులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఇంద్రసేనా రెడ్డి సమక్షంలో పలువురు బీజేపీలో చేరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో చేరిన వారికి ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ ప్రతాప్, ప్రధాన కార్యదర్శి, రామన్‌గౌడ్, రమేష్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న 'కంటి వెలుగు'



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పాన్‌గల్: మండలంలోని చింతకుంట, కేతేపల్లి, రాయినిపల్లి గ్రామాల్లో సోమవారం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో 498 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. వీరిలో 54 మందికి కంటి అద్దాలు, 80 మందిని ఆపరేషన్ నిమిత్తం సిపార్సు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కంటి వెలుగు కార్యక్రమంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. ఎక్కువ మంది పరీక్షలు చేయించుకునేలా సిబ్బంది అవగాహన కల్పిస్తున్నట్లు డాక్టర్ పేర్కొన్నారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని నాగరాల గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో కంటి పరీక్షలు నిర్వహించామని మండల వైద్యాధికారి రాముడు తెలిపారు. వారిలో 17 మందికి రీడింగ్ అద్దాలను పంపిణీ చేశామని, 16 మందికి అద్దాల తయారీకి పంపించామన్నారు. 16 మందిని ఆపరేషన్ అవసరం ఉన్న వారీగా గుర్తించామని తెలియజేశారు. పవన్‌కుమార్ ప్రియాంక, సత్యమ్మ పాల్గొన్నారు.